RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 263 పేజీలు - 08 మంగళవారం 18 ఆగస్టు 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## విద్య, వైద్య రంగాలకు
# అత్యంత ప్రాధాన్యం

● ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి ● విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది ● ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం ● గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు ● వచ్చే ఏడాదికల్లా ఉస్మానియా సహా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం ● కార్పోరేట్ స్థాయిలో ఆస్పత్రుల నిర్వహణ ● సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 17:** తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి



అన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ. 2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు.తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు మిగతా2లో...

## కళ్యాణ,షాదీముబారక్
# కొనసాగుతుంది

● గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు ● అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి ● దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం

మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 17:** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మి పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్‌కు మిగతా2లో...

## 22ఎ భూములపై
# ఆందోళన వద్దు

● అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది ● అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం ● నిషేధిత జాబితా నుంచి భూములను తొలగిస్తాం ● టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలి ● ప్రజలను ఆఫీసులకు తిప్పే అధికారులపై చర్యలు తీసుకుంటాం ● మీడియా సమావేశంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి వివరణ



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 17:** ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ..అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ మిగతా2లో...

## తెలంగాణలో సర్ జాబితా విడుదల

- 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు స్వీకరణ
- 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తింపు
- సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు
- ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల






## సుప్రీంలో రాహుల్‌కు ఊరట

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విచారణ నిలిపివేత

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఆగస్టు 17:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టులో మిగతా2లో...

## డబ్బులు దండుకోవడానికే
# నిషేధిత జాబితా

- ప్రజల్లో గందరగోళం రేపిన 22ఎ జాబితా
- మీడియా సమావేశంలో ప్రభుత్వ తీరుపై హరీష్ ఆగ్రహం



**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 17:** రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. మిగతా2లో...

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు
# తొలి విమానం రాక

- ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు



**తొలి అక్షరం/అమరావతి,ఆగస్టు 17:** భోగాపురం అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మిగతా2లో...

## జహీరాబాద్
# పారిశ్రామిక స్మార్ట్ సిటీ

2 లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యం

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 17:** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి చేస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక వాడకు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన చెప్పారు. సోమవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్ లు న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్సులో శ్రీధర్ బాబు సచివాలయం నుంచి వర్చువల్ గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్య మంత్రులు, పరిశ్రమల మంత్రులు ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మిగతా2లో...



## జార్ఖండ్ జంగ్.. 23వ రోజుకు
# విద్యార్థి ఆందోళన

సీఎం సోరెన్, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మల దహనం

ఇక వ్యూహం మార్చుకుంటామన్న విద్యార్థి నేతలు

సర్కార్ దిగిరాకపోతే.. సీఎం రాజీనామాకే డిమాండ్

20న ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి పిలుపు

డిమాండ్లు నెరవేరుస్తారా.. రాజీనామా చేస్తారా

జార్ఖండ్ సీఎంకు విద్యార్థుల హెచ్చరిక..

హేమంత్, రాహుల్, తేజస్వీ యాదవ్ దిష్టిబొమ్మల దగ్ధం



# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే,. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు.

టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి.2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నానని అన్నారు. మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు.కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట.అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట.. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా..ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి.. నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయని అన్నారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా.వాళ్లు అబద్దాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని అన్నారు.మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ,షాదీముబారక్ కొనసాగుతుంది

(మొదటి పేజీ తరువాయి)

అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు..ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయాం.. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్న మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేము కొనసాగిస్తున్నాం అన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ,మంత్రులు ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ,బలహీన వర్గాల నాయకులు ,కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొన్ననే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహావిష్కరణ చేసుకున్నామని మంత్రి వివరించారు.

# డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎలాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియదం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు హరీశ్ రావు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమిషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమిషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ÷ల్ కూడా కదలడం లేదు. చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైందన్నారు హరీశ్ రావు. మీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా.. ? స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి..? వాళ్ల గోడు ఎవరు వినాలి. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఎలో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకు.. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ం నుంచి తొలగించాలి కానీ.. ఈ రివ్యూల పేరుతో కాల యాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి..? కమిషన్ల కోసమేనా..? అసలు ఈ ప్రాపర్టీలను అందులో ఎవరు పెట్టారు? కమిషన్లు తీసుకుని ఎవరు తొలగిస్తున్నారు..? దీనిపై తక్షణమే విచారణ జరగాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 7, 2023 నుంచి భూములను ప్రొహిబిషన్ లిస్ట్ లో పెట్టి న వివరాలు ప్రభుత్వం వెంటనే వైట్ పేపర్ విడుదల చేసి నిజాలను ప్రజల ముందు ఉంచాలి. అప్పటిలోగా ఈ ఆస్తులన్నింటినీ దాని పరిధి నుంచి మినహాయించాలన్నారు .

# తెలంగాణలో సర్ జాబితా విడుదల

**తొలి అక్షరం/హైదరాబాద్,ఆగస్టు 17:** తెలంగాణలో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. సర్ ప్రక్రియలో మొదటి భాగం పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 78.30 శాతం ఎన్యూమరేషన్ పత్రాలు అందినట్లు తెలిపారు. 2.73 శాతం మంది చనిపోయినవారిగా గుర్తించినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు సుమారు 60 లక్షల మంది అనామలీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అలాగే 32 లక్షల మంది ఓటర్లు మ్యాపింగ్ చేసుకోలేదని గుర్తించారు. ఈ నేపథ్యంలో సుమారు 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించు కోవాలని సూచించారు. నోటీసులు అందుకున్న వారు వీలైనంత త్వరగా స్పందించాలని కోరారు.

ఏ కారణంతో నోటీసు జారీ చేశామో స్పష్టంగా తెలియజేస్తామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యంతరాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు.

ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాలు, సంబంధిత దరఖాస్తులను పరిశీలించనున్నట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు.

పరిశీలన ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మందికి పైగా అధికారులు పాల్గొంటారని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఎవరి ఓట్లు అయినా లేకపోతే ఫారం 6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ముసాయిదా జాబితాను ఎన్నికల అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

# సుప్రీంలో రాహుల్‌కు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్న విచారణను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు నిలిపివేయాలని ఆదేశించింది. అలాగే ఈ కేసులో సీబీఐ, ఈడీ ఎలాంటి నివేదికను ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టుకు సమర్పించకూడదని స్పష్టం చేసింది. రరాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఇప్పటికే ఈ కేసులో తదుపరి విచారణను ఆగస్టు 20న చేపట్టనుంది. అయితే హైకోర్టు విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయాలని తాజాగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తమ దర్యాప్తు లేదా పరిశీలనకు సంబంధించిన ఎలాంటి నివేదికను హైకోర్టుకు సమర్పించకుండదని పేర్కొంది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ వ్యవహారం అలహాబాద్ హైకోర్టుకు వెళ్లింది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలను పరిశీలించాలని సీబీఐ, ఈడీకి హైకోర్టు గతంలో సూచించింది. ఈ ఆదేశాలను రాహుల్ సుప్రీంలో సవాల్ చేశారు. అంతేకాకుండా ఈ కేసు విచారణను అలహాబాద్ హైకోర్టు నుంచి ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రత్యేక పిటిషన్ కూడా దాఖలు చేశారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం రాక

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. చరిత్రాత్మక ఘట్టానికి భోగాపురం వేదికైందన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి తొలి ఇండిగో విమానం భోగాపురం విమానాశ్రయానికి చేరుకుందన్నారు. తొలి విమానం రాకతో ఏపీ.. కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఉత్తరాంధ్రకు మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం.. రాష్ట్రంలో కొత్త అవకాశాలకు బాటలు వేస్తోందని సీఎం చెప్పుకొచ్చారు. యువత ఆశలు, ఆకాంక్షలకు ఈ విమానాశ్రయం రెక్కలు తొడుగుతుందని.. విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలకు మరింత ఊతమిస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్టు కీలకంగా మారనుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చరిత్రాత్మక కొత్త ఆరంభమని.. ఉత్తరాంధ్రకు కొత్త గేట్‌వేగా అవతరించనుందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఏపీ కొత్త శకానికి నాంది పలికిందని సీఎం వెల్లడించారు.

# 22ఏ భూములపై ఆందోళన వద్దు

(మొదటి పేజీ తరువాయి)

భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరపున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఏ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెన్యూన్ కేసుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005- 994788కి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 511 అప్లికేషన్లు, రంగారెడ్డి జిల్లాలో 146 అప్లికేషన్లు వచ్చాయి. హైదరాబాద్‌లో 49, సంగారెడ్డిలో 38 అప్లికేషన్లు వచ్చాయి. ప్రైవేటు భూమిని 22-ఏ కింద పెట్టారని 757 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ 22-ఏ జాబితాలోకి ఎందుకు వచ్చాయనే అంశంపై చర్చించాం. ప్రైవేటు ఆస్తుల యజమానులను ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. గ్రౌండ్ రియాలిటీ ఎలా ఉందనే అంశంపై సమీక్షించాం. న్యాయంగా ఉన్నవాటిని త్వరలోనే నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం'.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. కోర్టులకు వెళ్లాల్సిన పనిలేదు. అధికారులకు అప్లికేషన్స్ ఇస్తే చాలని మంత్రి వివరించారు. న్యాయబద్ధమైన మీ ఆస్తులకు తొందరగా క్లియరెన్స్ లభిస్తుంది. ప్రజలు ఆందోళన చెందవద్దు. కొన్ని ప్రాంతాల్లో అధికారుల తప్పిదాలను గుర్తించాం. కోర్టు ఆదేశాలను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేయకపోవడం వల్లే సమస్య ఏర్పడింది. అధికారుల తప్పిదాలను సవరణ చేస్తున్నాం. నిజమైన కేసులు త్వరలోనే పరిష్కారం అవుతాయని అన్నారు.

# జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అందజేస్తోంది. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్ కు అభివృద్ధి ప్రణాళికను అందజేసినట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్ మెంట్, కన్ స్ట్రక్షన్ (ఇపిసి) పద్ధతిలో జరగుతున్న పనులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయిని శ్రీధర్ బాబు వెల్లడించారు. నీటి సరఫరా పనుల టెండర్ల పక్రియ పూర్తయిందని చెప్పారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. భవ్య పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణాకు కేటాయించాలని మంత్రి పీయూష్ గోయెల్ ను కోరారు. వీడియో కాన్ఫరెన్సులో టిజిఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# జార్ఖండ్ జంగ్.. 23వ రోజుకు విద్యార్థి ఆందోళన

**తొలి అక్షరం/రాంచి :ఆగస్టు 17:** జేపీఎస్‌సీ-జేఎస్ఎస్‌సీ విద్యార్థుల నిరసనలు ఆదివారంతో 23వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థులు తమ నిరసనల వ్యూహాన్ని మార్చుకుంటున్నట్టు ప్రకటించారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే సీఎం హేమంత్ సోరెన్ రాజీనామాను కోరుతామని హెచ్చరించారు. అంతే కాకుండా ఆగస్టు 20న సీఎం ఇంటికి మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో నిరసనలు మరో మలుపు తిరిగాయి. ఆగస్టు 10న నిర్వహించిన అసెంబ్లీ మార్చ్‌లో విద్యార్థులపై పోలీసులు వాటర్ కానన్లు, టియర్ గ్యాస్ వినియోగించడంతో పాటు లాఠీ చార్జ్ చేయడంతో అప్పటి నుంచే నిరసనలు మరింత ఉధృతంగా మారాయి. ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న వారిలో ఒకరైన పియూష్ సింగ్ మాట్లాడుతూ స్టూడెంట్లు నాలుగు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినట్టు చెప్పారు.జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయడం, జేపీఎస్‌సీ 11వ, 13వ పరీక్షలను రద్దు చేయడంతో పాటు టీడీపీఎల్ సంస్థతో సంబంధం ఉన్న అన్ని పరీక్షలను రద్దు చేసి ప్రస్తుతం జరుగుతున్న విచారణలను సీబీఐకి అప్పగించాలని కోరుతున్నారని వెల్లడించారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే ఆగస్టు 20న అసలు సినిమా ఉంటుందన్నారు. సీఎం రాజీనామాను కోరుతామని హెచ్చరించారు. అయితే జేపీఎస్‌సీకి సంబంధించిన మూడు పరీక్షలను రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ సీజీఎల్ కు సంబంధించిన పరీక్షను రద్దు చేయడం కుదరదని.. అది కోర్టుల పరిధిలో ఉందని ఓ మంత్రి పేర్కొన్నారు. సీఎం ఇల్లు ముట్టడి ప్రకటన నేపథ్యంలో పోలీసులు ఆయన ఇంటి వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

# మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- 150 మందికి ఉచిత పరీక్షలు మందుల పంపిణీ
- గ్రామానికి ఉచిత అంబులెన్స్ సేవలు డైరెక్టర్ నర్కుటి రాము హామీ




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 17:** గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా తొర్రూర్ మెడికేర్ హాస్పిటల్ ప్రతినిధులు ముందుకు సాగుతున్నారు. పతేపురం గ్రామ పంచాయతీ పరిధిలో మెడికేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మెడికేర్ హాస్పిటల్ డైరెక్టర్ నర్కుటి రాము పర్యవేక్షణలో అనుభవజ్ఞులైన వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది దాదాపు 150 మంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు పరీక్షలు చేసి, బాధితులకు అవసరమైన ఔషధాలను ఉచితంగా పంపిణీ చేశారు. అత్యవసర సమయంలో గ్రామీణ ప్రజలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పతేపురం గ్రామానికి ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నాం. గ్రామస్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ఉచిత వైద్యంతో పాటు అంబులెన్స్ హామీ ఇచ్చిన మెడికేర్ హాస్పిటల్ యాజమాన్యానికి సర్పంచ్ ఇట్టే మాధవ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సతీష్, వార్డు మెంబర్లు నాగిరెడ్డి, విశ్వనాథం, గ్రామ పెద్దలు, హాస్పిటల్ వైద్య సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి

## -పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 17:** యువత,వ్యాపారవేతలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కింగ్స్ స్వీట్ హౌస్,ప్రిన్స్ కిడ్స్ స్టూడియో, లక్ష్మీనరసింహ ఎంటర్ ప్రైజెస్ లను స్థానిక నాయకులు, ఆయా షాపుల నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వి రెడ్డి మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలన్నారు. వ్యాపార రంగంలో మంచి అభివృద్ధి సాధించాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ఆయా షాపుల నిర్వాహకులు లవిశెట్టి రంజిత్, ఎండి సజ్జు, ఎండి. మసూద్ లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి, పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఖానాపురం సర్పంచ్ మై పాషా, కాంగ్రెస్ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య,చిత్తలూరి శ్రీనివాస్,జాటోత్ రవి నాయక్, పేరటి యాకూబ్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి,దొంగరి శంకర్, మిత్తింటి హరీష్, వెలుగు మహేశ్వరి, బచ్చలి లక్ష్మణ్, మహేష్ యాదవ్, నరేందర్ నాయక్, భూతం భరత్,చంటి,పాషా తదితరులు పాల్గొన్నారు.

# సోమారంలో వైభవంగా శివాలయ పునఃప్రతిష్ఠాపన

## - వేడుకల్లో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 17:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం సోమారం గ్రామంలో నిర్వహించిన శివాలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానం మేరకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ... శివాలయం పునఃప్రతిష్ఠాపన సందర్భంగా గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐకమత్యాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,మండలం పార్టీ అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి,సీనియర్ నాయకుడు కుందూరు విద్యాకర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు పున్నం రామ్మూర్తి, యూత్ అధ్యక్షుడు ఘర్షల రాజేష్, కాంగ్రెస్ నాయకులు ఘర్షల శ్రీనివాస్, కరుణాకర్, మునిగేటి గిరిధర్,గడ్డం గట్టుమల్లు,బోలే షావలి, నలమాస రాహుల్,భాష బోయిన నరేష్,కొరుపెల్లి రమేష్,మేడి వెంకన్న, ఇతర నాయకులు, కార్యకర్తలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీబీఎస్ఈ ఖో-ఖో పోటీల్లో 'ఏకశిల' జయకేతనం

- బాలుర, బాలికల విభాగాల్లో ఏపీ, తెలంగాణ
క్లస్టర్ విజేతలుగా పున్నేలు విద్యార్థులు
- జాతీయ స్థాయి పోటీలకు
ఎంపికైన 24 మంది క్రీడాకారులు
- విజేతలను అభినందించిన చైర్మన్ తిరుపతి రెడ్డి




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం ఆగస్టు 17:** ఏపీ, తెలంగాణ సీబీఎస్ఈ క్లస్టర్7 ఖో–ఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఐనవోలు మండలం పున్నేలుకు చెందిన ఏకశిల హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభతో ఆధిపత్యం చాటారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఒలంపియా పాఠశాలలో ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన బాలుర విభాగం పోటీల్లో మొత్తం 84 జట్లు తలపడగా, 12 మందితో కూడిన ఏకశిల హైస్కూల్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని విజేతగా నిలిచింది. ఇటీవల జరిగిన బాలికల విభాగం పోటీల్లోనూ ఏకశిల జట్టు ప్రథమ స్థానం సాధించగా, ఇప్పుడు బాలురు కూడా అదే రీతిలో ప్రతిభ చాటడం గమనార్హం. డబుల్ ధమాకా సాధించిన ఏకశిల పాఠశాల నుంచి బాలురు, బాలికల విభాగాల్లో కలిపి మొత్తం 24 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి సీబీఎస్ఈ పోటీలకు ఎంపికయ్యారు. తమిళనాడులోని కాంచీపురం (వీలమ్మల్ విద్యాలయ, సినీర్ కుప్పం) వేదికగా సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న జాతీయ పోటీల్లో వీరు క్లస్టర్ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ తిరుపతి రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, షీల్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో చదివే విద్యార్థులకు చదువుతో పాటు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేలా ఉన్నత ప్రమాణాలతో క్రీడా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. జాతీయ స్థాయిలోనూ విద్యార్థులు రాణించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తేవా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.డి. బాబా, వైస్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, ఇంచార్జి వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సయ్య, కోచ్ రజినీకర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# తొర్రూర్ తహసిల్దార్ జి. శ్రీనివాస్‌ను సత్కరించిన రెవెన్యూ సిబ్బంది, జీపీఓలు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఆగస్టు 17:** ఉత్తమ ఉద్యోగి అవార్డు గ్రహీత, తొర్రూర్ తహసిల్దార్ జి. శ్రీనివాస్‌ను సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, జీపీఓలు ఘనంగా సన్మానించారు. ఆయన ప్రతిభ, పారదర్శకమైన పాలనకు లభించిన ఈ గౌరవం స్థానిక కార్యాలయానికి ఎంతో గర్వకారణమని సిబ్బంది కొనియాడారు. విధి నిర్వహణలో చూపిన ప్రతిభ, ప్రజలకు అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా తహసిల్దార్ శ్రీనివాస్‌కు ఇటీవల ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. ఈ సందర్భంగా కార్యాలయ వాతావరణం పండుగలా మారింది. ఆఫీస్ సిబ్బంది, జీపీఓలు అందరూ కలిసి ఆయనకు పూలమాలలు వేసి, శాలువా కప్పి, జ్ఞాపికను అందించి ప్రత్యేకంగా అభినందించారు. సన్మానం అనంతరం సిబ్బంది మాట్లాడుతూ... తహసిల్దార్ జి. శ్రీనివాస్ నాయకత్వంలో పనిచేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా అందేలా చూడటంలో ఆయన నిరంతరం శ్రమిస్తారని, ఈ అవార్డు ఆయన అంకితభావానికి సరైన గుర్తింపు అని పేర్కొన్నారు. తనకు దక్కిన సన్మానంపై తహసిల్దార్ జి. శ్రీనివాస్ స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఆఫీస్ సిబ్బంది, జీపీఓల సమష్టి కృషి, సహకారం వల్లే ఈ అవార్డు సాధ్యమైందని చెప్పారు. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, జీపీఓలు, రెవెన్యూ శాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంకిరెడ్డిగూడెంలో డంపింగ్ యార్డ్ పనులు వెంటనే నిలిపివేయాలి

జనావాసాలు, పాఠశాలలకు దూరంగా
డంపింగ్ యార్డ్‌ను తరలించాలి
కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి ప్రజల
ఆరోగ్యాన్ని కాపాడుతామని హామీ



**తొలి అక్షరం/చౌటుప్పల్, ఆగస్టు 17:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం రెవెన్యూ పరిధిలోని అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 326లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు చేపడుతున్న నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్మశాన వాటిక పక్కన ఉన్న కట్ట స్థలం నుంచి కాంశెట్టి పెంటయ్య బావి మీదుగా మైనార్టీ పాఠశాల వెనుక భాగం వరకు ఉన్న ప్రాంతంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను తరలించి నిల్వ చేసేందుకు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రాంతానికి సమీపంలో జనావాసాలతో పాటు మైనార్టీ పాఠశాల, జడ్పీహెచ్ఎస్ ఉన్నందున డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భద్రతకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా అంకిరెడ్డిగూడెం సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పార్టీలకతీతంగా కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి కె. శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్‌ను ప్రస్తుత ప్రాంతంలో ఏర్పాటు చేయకుండా, జనావాసాలకు, మైనార్టీ పాఠశాలకు, జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు, సమీపంలోని రెండు గ్రామాలకు కనీసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించాలని వారు కోరారు. గ్రామస్తుల వినతిని పరిశీలించిన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఏ. భాస్కరరావు చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మైనార్టీ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, పాఠశాల సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు సంబంధించిన పనులను నిలిపివేయాలని సూచించినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం కలెక్టర్ కూడా స్పందిస్తూ డంపింగ్ యార్డ్‌ను తప్పనిసరిగా ఇతర ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకుంటామని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు రెండు గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్ల అండాలు, రాపోలు రేణుక, బొమ్మని శ్రావణి, స్వామి గౌడ్, సుర్వి సత్తయ్య గౌడ్ (మాజీ సర్పంచ్), యాట శంకరయ్య, పర్ని శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల సెట్టయ్య గౌడ్, భీమగోని మల్లేశం గౌడ్, సుర్వి సత్తయ్య గౌడ్ (మాజీ ఉపసర్పంచ్), ముద్దం లక్ష్మయ్య గౌడ్, అంతటి జంగయ్య గౌడ్, రాపోలు మల్లేశం, సుర్వి నరసింహ, భీమగోని మణికుమార్, బోడెపు లక్ష్మయ్య గౌడ్‌తో పాటు గ్రామ యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ, ఎస్‌టీఐలపై అవగాహనతో పాటు సకాలంలో పరీక్షలు చేయించుకోవాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఇండియా ఫైట్స్ హెచ్ఐవీ అండ్ ఎస్‌టీఐ
ప్రచార పోస్టర్ ఆవిష్కరణ
గోప్యమైన స్వీయ అంచనా కోసం క్యూఆర్ కోడ్ వినియోగించుకోవాలి
1097 జాతీయ ఎయిడ్స్ హెల్ప్‌లైన్ ద్వారా ఉచితంగా గోప్యమైన సహాయం పొందవచ్చు



**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు,17:** హెచ్ఐవీ, ఎస్‌టీఐలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు, అనుమానం ఉన్నప్పుడు సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, సకాలంలో పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించేందుకు చేపడుతున్న ఇండియా ఫైట్స్ హెచ్ఐవి అండ్ ఎస్టీఐప్రచారంలో భాగంగా రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ హెచ్ఐవీ లేదా ఎస్‌టీఐలకు సంబంధించి ఏవైనా సందేహాలు, అనుమానాలు ఉన్నవారు ఆలస్యం చేయకుండా తమ ఆరోగ్య పరిస్థితిపై అవగాహన పొందాలని సూచించారు. అవసరమైన వారు సకాలంలో పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనల మేరకు తగిన చికిత్స, సేవలు పొందాలని తెలిపారు. **క్యూఆర్ కోడ్ ద్వారా గోప్యమైన స్వీయ అంచనా** జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) ఆధ్వర్యంలో బ్రేక్ ఫ్రీ ప్రచారంలో భాగంగా హెచ్ఐవీ, ఎస్‌టీఐలకు సంబంధించిన డిజిటల్ స్వీయ అంచనా సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అధికారిక ప్రచార పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి, వ్యక్తిగత ఆరోగ్యం, వ్యాధుల బారిన పడే ప్రమాదానికి సంబంధించిన సులభమైన ప్రశ్నలకు గోప్యంగా సమాధానాలు ఇవ్వడం ద్వారా స్వీయ అంచనా చేసుకోవచ్చని వివరించారు. స్వీయ అంచనా అనంతరం అవసరమైన నివారణ చర్యలు, ఆరోగ్య సంబంధిత మార్గదర్శకాలు, సమీపంలోని పరీక్షా కేంద్రాలు, ఇతర వైద్య సేవల వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. **1097 జాతీయ ఎయిడ్స్ హెల్ప్‌లైన్ ద్వారా సేవలు:** హెచ్ఐవీ, ఎస్‌టీఐలకు సంబంధించిన సందేహాలు, సమాచారం లేదా సహాయం కోసం 1097 జాతీయ టోల్‌ఫ్రీ ఎయిడ్స్ హెల్ప్‌లైన్ ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. ఈ సేవ ద్వారా గోప్యంగా, ఉచితంగా అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం పొందవచ్చని పేర్కొన్నారు. హెచ్ఐవీ, ఎస్‌టీఐలపై అపోహలు, భయాలను తొలగించి ప్రజల్లో సరైన అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, వైద్యాధికారులు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికి 'జస్విక శ్రీ' అని నామకరణం చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు,17:** ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన కాంపాటి రాకేష్, మాధవి దంపతులకు 2026 మే 9న ఆడబిడ్డ జన్మించింది. జన్మించిన 12 రోజుల అనంతరం చిన్నారి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. చిన్నారి వైద్య చికిత్సకు పెద్ద మొత్తంలో ఖర్చు అవసరం కావడంతో ఆ కుటుంబం ఆందోళనకు గురైంది.ఈ విషయాన్ని ఖమ్మం నగరపాలక సంస్థలో శానిటేషన్ విధులు నిర్వహిస్తున్న చిన్నారి నానమ్మ నరసమ్మ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకువచ్చారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న కమిషనర్ వెంటనే స్పందించి, హృదయ స్వచ్ఛంద సంస్థతో పాటు ప్రభుత్వ సహకారంతో చిన్నారి గుండె శస్త్రచికిత్సకు అవసరమైన రూ.14 లక్షల ఆర్థిక సహాయం మంజూరయ్యేలా కృషి చేశారు.ఈ సహాయంతో జూలై 28న చిన్నారికి గుండె శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించగా, ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా కోలుకుంది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు తమ కుమార్తెను మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి తీసుకువచ్చి, గ్రీవెన్స్ కార్యక్రమంలో తమకు అందించిన సహాయానికి కృతజ్ఞతలు



తెలిపారు.చిన్నారికి మున్సిపల్ కమిషనర్ గారు పేరు పెట్టాలని కుటుంబ సభ్యులు కోరగా, కమిషనర్ అభిషేక్ అగస్త్య సంతోషం వ్యక్తం చేస్తూ చిన్నారికి 'జస్వికశ్రీ' అని నామకరణం చేశారు. చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో, సంతోషంగా ఎదగాలని కమిషనర్ ఆకాంక్షించారు.ఆపదలో ఉన్న కుటుంబానికి సకాలంలో స్పందించి వైద్య సహాయం అందేలా కృషి చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్యకు చిన్నారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

**చౌటుప్పల్ నుంచి పార్టీలకతీతంగా గౌడ కులస్తులు భారీగా తరలిరావాలి**

**చెరుకు లింగస్వామి గౌడ్. చౌటుప్పల్ గౌడ్ సంఘమ్ సంయుక్త కార్యదర్శి**



**తొలి అక్షరం/చౌటుప్పల్:ఆగష్టు 17:** హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చౌటుప్పల్ గౌడ సంఘం సంయుక్త కార్యదర్శి చెరుకు లింగస్వామి గౌడ్ పిలుపునిచ్చారు.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా జరగనున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి చౌటుప్పల్ మండలం నుంచి గౌడ కులస్తులు పార్టీలకు అతీతంగా అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వీరత్వం, పోరాట స్ఫూర్తి, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రతి గౌడ కుటుంబం ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వాములు కావాలని చెరుకు లింగస్వామి గౌడ్ కోరారు.

# వందే భారత్ అవార్డు అందుకున్న మునగాల కళా వెంకట రత్నం

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు,17:** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనందలహరి సంస్థ ఆధ్వర్యంలో ఈ రోజు రవీంద్ర భారతి పైడి జయరాజు ఫ్రీ వ్యూ థియేటర్ హైదరాబాదులో వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డును ప్రముఖ సినీ దర్శకులు శ్రీ రేలంగి నరసింహారావు గారి చేతుల మీదగా వందే భారత్ అవార్డు అందుకున్న మునగాల కళా వెంకట రత్నం కళా రంగంలో ఎంచుకున్న మార్గంలో ఎంచుకున్న వృత్తిలో ఉత్తమ సేవల అందిస్తూ దేశ సమగ్రతను జాతీయ సమైక్యతను కాంక్షిస్తున్నందున జాతీయ సమైక్యత అవార్డుతో పాటు ప్రశంస పత్రమును అవార్డు గ్రహీత ప్రముఖ జానపద కళ సీనియర్ కళాకారులు పిట్టలదొర తెలంగాణ సాంస్కృతిక సారథి మునగాల వెంకటరత్నమ్మకు ప్రధాని చేయడం జరిగినది ఖమ్మం జిల్లాలో సుమారు 30 సంవత్సరాలగా సమాచార పౌర సంబంధాల శాఖలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సార నిషేధం పర్యావరణం ఎయిడ్స్ కుటుంబ నియంత్రణ అక్షరాస్యత అంటరానితనం బాల్య వివాహములు సామాజిక రుగ్మతలపై జానపద కళాకారుడుగా హరితహారం జన్మభూమి ఇందిరమ్మ సంబరాలు కుటుంబ నియంత్రణ స్తంభాద్రి సంబరాలు ఇందిరా మహిళా శక్తి వివిధ రకాల సామాజిక రుగ్మతలపై ప్రజలలో నిరంతర చైతన్యం మరియు అవగాహన కల్పించారు మారుమూల పల్లెల్లో కు సైతం కాలిబాట ద్వారా వెళ్లి గిరిజన ప్రజలలో కోయగూడాలలో పచ్చదనం పరిశుభ్రత పారిశుద్ధ్యం మూఢనమ్మకాలపై విస్తృతంగా తన కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు గతంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం చేత జిల్లా స్థాయి జాతీయస్థాయి మండల స్థాయి రాష్ట్రస్థాయిలో సైతం కూడా అవార్డులను కైవసం చేసుకున్నారు తనతోపాటు మరో పదిమంది కళాకారులతో కళా బృతి



కల్పించడం లో మునగాల వెంకటరత్నం ఎప్పుడు ముందుండేవారు గత ముఖ్యమంత్రులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు మరియు కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి చేత ప్రశాంస పత్రాలు అవార్డులు అందుకోవడం జరిగింది మరియు మంత్రులు ఎమ్మెల్యేలు ద్వారా ప్రశంసలు పొందడం జరిగింది 1992 నుండి 2026 వరకు జిల్లా కలెక్టర్ల చేత ఉత్తమ సేవ ప్రశాంస పత్రాలు అందుకోవడం జరిగింది జిల్లాస్థాయి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో క్యాష్ అవార్డు మరియు ప్రశంస పత్రం అందుకోవటం జరిగింది తన యొక్క కళా రంగం విశ్వరూపమే ఏ అవార్డుకు కారణం భవిష్యత్తులో మరెన్నో అవార్డులు రివార్డులు పొందాలని కళా రంగంలో రాణించాలని కోరుకుందాం మునగాల వెంకటరత్నం అవార్డు రావడం పట్ల జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి మహమ్మద్ గౌస్ గారు మరియు గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు గారు వందనం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొన్నం చిన్న శంకర్ వారితోపాటు గ్రామంలోని గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు గారు ఏడుకొండలు తదితరులు అభినందించడం జరిగింది వారితోపాటు సీనియర్ కళాకారులు కన్నెబోయిన అంజయ్య గారు మిమిక్రీ సుధాకర్ గారు పమ్మి రవి గారు పాగి వెంకన్న గారు బీరెల్లి రమణ గారు నందు గారు గురవయ్య గారు జాను గారు మొగిలి వెంకటేశ్వర్లు గారు తదితరులు ఈ అవార్డు రావడం పట్ల జిల్లాకి గర్వకారణం అని అభినందించడం జరిగినది ఖమ్మం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు జానపద సంఘ కళాకారులు నిరుద్యోగ కళాకారుల సంఘం కళాకారులు యువజన సంఘాలు కళాకారులు వారు మునగాల వెంకటరత్నమును అభినందించారు మరియు హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయత జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ గారు మరియు ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహ రావు గారు వంశీ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు గారు ప్రముఖ సినీనటులు జెన్ని పోలా ప్రగడ జనార్దన్ రావు గారు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కపు వెంకటరమణ గారు మరియు వందే భారత్ మూవీ డైరెక్టర్ దర్శకనిర్మాత కళా రత్న మల్ల రమేష్ గారు ఆధ్వర్యంలో ప్రముఖుల చేత అవార్డును అందుకోవటం జరిగింది.ఖమ్మం జిల్లాకు గర్వకారణం మరియు వందనం గ్రామం నుంచి వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డు పొందటం మా గ్రామ ప్రజలకు ఎంతో సంతోషం అంటూ వందనం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచ్ శ్రీ ఆవుల నాగేశ్వరరావు గారు మునగాల వెంకటరత్నం ను ప్రత్యేకంగా అభినందించడం జరిగినది.

# ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహణ .... జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు,17:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండస్ఇండ్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఖమ్మం కీర్తన గోల్డ్ లోన్స్ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించుటకు ఆగస్టు 19న(బుధవారం) ఉదయం 10.00 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ కు ఎదురుగా ఉన్న టీటీడీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్. మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ అడ్వైజర్ (50) ఉద్యోగాలకు ఎస్సెస్సి, ఇంటర్, ఏదేని డిగ్రీ అర్హత గల 18–40 మధ్య వయస్సు గలవారు, ఇండస్ఇండ్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (20) ఉద్యోగాలకు ఏదేని డిగ్రీ అర్హత గల 18–30 వయస్సు గల మహిళా అభ్యర్థులు, ఖమ్మం కీర్తన గోల్డ్ లోన్స్ కంపెనీ లో లోన్ ఆఫీసర్, రిలేషన్షిప్ ఆఫీసర్ (25) ఉద్యోగాలకు ఏదేని డిగ్రీ అర్హత గల 18–30 వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి వేతనం 10 వేల నుండి 50 వేల వరకు ఉంటుందని తెలిపారు. మొత్తం 95 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి అర్హత గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు హెచ్ ఆర్ సెల్ నెంబర్ 8143420505, 9618890879, 8106790700 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

- పాత్రికేయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు




**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా, ప్రతినిధి ఆగస్టు 17:** జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని స్పష్టంగా ప్రకటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపులో జాప్యం చేయడం సరికాదని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు.సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు సచివాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. **కేబుల్, ఐపీ న్యూస్ ఛానళ్లకు అక్రెడిటేషన్ ఇవ్వాలి** రాష్ట్రంలోని అన్ని కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లకు వెంటనే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. అదేవిధంగా ఇంటర్నెట్ ప్రోటోకాల్ (ఐపీ) ఆధారిత న్యూస్ ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేబుల్ ఛానళ్లకు జిల్లాస్థాయిలో నాలుగు, రాష్ట్రస్థాయిలో 12 అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. **జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు** అక్రెడిటేషన్ కార్డులు మంజూరవుతున్నప్పటికీ జర్నలిస్టులకు హెల్త్ కార్డుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫెడరేషన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న తరహాలో అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. **అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు** సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా ప్రభుత్వం చట్టపరమైన మార్గాలను పరిశీలించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను కూడా ఈ పథకంలో పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రత్యేకంగా సహాయం, సంక్షేమ చర్యలు అందించాలని కోరారు. **ప్రకటనల పెండింగ్ బిల్లులు చెల్లించాలి** చిన్న, మధ్యతరహా పత్రికలకు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలని నాయకులు డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా పత్రికలను ప్రభుత్వ ప్రకటనల ఎంపానెల్‌మెంట్‌లో చేర్చి వాటి మనుగడకు సహకరించాలని కోరారు. **రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్** సీనియర్, రిటైర్డ్ జర్నలిస్టుల కోసం ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని ఫెడరేషన్ కోరింది. జర్నలిస్టుల పిల్లలు ఎంతవరకు చదువుకున్నా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. అలాగే జర్నలిస్టులందరికీ ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పించాలని, జర్నలిస్ట్ మరణించిన సందర్భంలో వారి కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం అందించే విధంగా పథకాన్ని అమలు చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చినట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి.రవికుమార్, కో–కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎస్.రవికుమార్ తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, ఆగస్టు,17:** ప్రజావాణిలో తమ సమస్యలు తెలుపుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.రఘునాధపాలెం మండలం పాపటపల్లి గ్రామానికి చెందిన చౌడవరపు దుర్గమ్మ తన కుమారుడు తనను అనేక బాధలు పెడుతున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కల్లూరు మండలం ఓబులరావు బంజర గ్రామానికి చెందిన భూక్యా మురళీ తాను శారీరకంగా దివ్యాంగుడినని తాను డిగ్రీ బీకాం కంప్యూటర్ చదివానని తనకు



ఏదైనా ప్రభుత్వ శాఖలో ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన రైతులు సర్వేనెంబర్ 19 లో తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వ్యవసాయం సాగు చేసుకుంటున్నామని, సర్వే నెంబర్ 19 అటవీ భూమికి సరిహద్దున ఉన్నందున పట్టా పాస్ పుస్తకాలు రాలేదని, 1950 మ్యాపు ప్రకారం తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమకు నాలుగు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎస్ ఈ మిషన్ భగీరథకు రాస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన కే. ఉపేందర్ తాను రెండు సంవత్సరాలుగా ర్యాపిడో బైక్ నడుపుకుంటున్నాని, ఎస్సీ కార్పొరేషన్ లో ఆటో కొరకు దరఖాస్తు చేసుకున్నానని చాలా పేదరికంలో ఉన్నానని తనకు ఆటో ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారికి రాస్తూ పరిశీలించి అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లికుదురు ఎస్సై గంగారపు కరుణాకర్‌కు ఘన సన్మానం

**మర్యాదపూర్వకంగా**

**కలిసి శాలువాతో సత్కారం**

**ఎంఆర్‌పీఎస్ నాయకుల**

**ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందనలు**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 17:** నెల్లికుదురు మండల ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గంగారపు కరుణాకర్ ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెల్లికుదురు మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొని ఎస్సై కరుణాకర్‌కు అభినందనలు తెలిపారు. ప్రజలకు న్యాయం, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన సేవలు మరింత విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.



# మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్తుకు బంగారు బాట





● షీటీం ఎస్సై రమాదేవి ●నేతాజీ రామవరం పాఠశాలలో నా మొక్క..నా బాధ్యత కార్యక్రమం ● చిన్నారులకు సేఫ్ టచ్,అన్‌సేఫ్ టచ్ పై అవగాహన ● వేధింపులు ఎదురైతే మౌనం వద్దు ● ఆపదలో ఉంటే భయపడొద్దు.. వెంటనే 112కి కాల్ చేయండి





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఆగస్టు17:** పర్యావరణ పరిరక్షణతో పాటు స్వీయ రక్షణ, సామాజిక అవగాహన ప్రతి ఒక్కరి బాధ్యత అని షీ టీమ్,యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్టియూ) సబ్ ఇన్‌స్పెక్టర్ రమాదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నేతాజీ రామవరంలో నిర్వహించిన నా మొక్క..నా బాధ్యత కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్సై రమాదేవి మాట్లాడుతూ.. మొక్కను నాటడం అంటే కేవలం భూమిలో ఒక నాటు వేయడం కాదు మన భవిష్యత్తును నాటడమే అని అన్నారు.నేడు నాటే చిన్న మొక్క రేపు పెద్ద చెట్టుగా మారి తరతరాలకు స్వచ్ఛమైన గాలిని,నీడను అందిస్తుంది అని తెలిపారు.ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దాన్ని మీ ప్రాణస్నేహితుడిలా సంరక్షించాలి అని సూచించారు.రోజువారీగా నీరు పోస్తూ దాని ఎదుగుదలను గమనిస్తే లభించే ఆనందం ప్రత్యేకమైనది అని చెప్పారు.పిల్లలు పాఠశాలలో శ్రద్ధగా చదువుకోవాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవంతో మసలుకోవాలని సూచించారు.

**వేధింపులు ఎదురైతే మౌనం వద్దు:** చిన్నారుల భద్రతకు సంబంధించి సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్ తేడాలను వివరిస్తూ..ఎవరైనా వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా, వెంటపడి బెదిరించినా భయపడకూడదని స్పష్టం చేశారు.సమస్యను మనసులోనే దాచుకుని మౌనంగా ఉండకుండా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు తెలియజేయాలన్నారు. పిల్లల భద్రత కోసమే షి టీమ్స్‘,‘ఏహెచ్టియూ‘ విభాగాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని నొక్కి చెప్పారు.

**ఆపదలో డయల్ 112 మీ రక్షణ కవచం** రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు లేదా మహిళలు, బాలికలపై వేధింపులు, గొడవలు ఎదురైనప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా 112 అత్యవసర నంబర్‌కు ఫోన్ చేయాలని పిలుపునిచ్చారు. సమయానికి పోలీసులకు సమాచారం అందిస్తే సత్వర సాయం అందుతుంది.ఆపదలో ఉంటే ధైర్యంగా ఉండండి, 112కు కాల్ చేయండి అని చెప్పారు. ఈ సత్కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన విజన్ ఆంధ్ర జిల్లా స్టాఫర్ ఉమా కాంత్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయ బృందానికి ఎస్సై రమాదేవి అభినందనలు తెలియజేశారు.

# కల్యాణలక్ష్మిని నిలిపివేసే కుట్రలను తిప్పికొడతాం

**పేదింటి ఆడబిడ్డల పెళ్లికి అండగా నిలిచిన పథకాన్ని కొనసాగించాలి**

**మహిళలతో కలిసి భారీ ధర్నా..**

**నడిరోడ్డుపై బైఠాయించి నిరసన**

**కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మునుగోడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు**

**తొలి అక్షరం/చౌటుప్పల్ : ఆగష్టు 17:** పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయరాదని మునుగోడు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పరిరక్షణ కోసం చండూరు పట్టణ కేంద్రంలో మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నడిరోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. 2014 అక్టోబర్ 2న రూ.50 వేల ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ పథకం అనంతరం రూ.1,00,116కు పెరిగి లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు.పేద కుటుంబాలు ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం అప్పులపాలు కాకుండా ఉండేందుకు కల్యాణలక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడిందని, తెలంగాణలోని లక్షలాది కుటుంబాల జీవితాల్లో ఈ పథకం వెలుగులు నింపిందని పేర్కొన్నారు. ఒక నియోజకవర్గంలోనే ఏటా వేలాది మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, దీన్ని బట్టే పేదలకు ఈ పథకం ఎంత అవసరమో అర్థం చేసుకోవచ్చన్నారు.

**కోర్టు వ్యవహారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు.కోర్టు మధ్యంతర ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో పథకాల పరిరక్షణ కోసం ప్రభుత్వం సమర్థవంతంగా న్యాయపోరాటం చేయాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.“కోర్టులో పథకం తరఫున బలమైన వాదనలు వినిపించి పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలి. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున న్యాయపోరాటానికి సిద్ధంగా ఉంటుంది” అని ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమ పథకాలపై నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆయన ఆరోపించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించేందుకు ప్రభుత్వం తక్షణమే అవసరమైన న్యాయపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



**రాజగోపాల్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు** స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై ప్రభాకర్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రోజుకో రకమైన ప్రకటనలతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు.“అధికార పార్టీలో ఉండి ప్రతిపక్ష నేతలా మాట్లాడటం రాజగోపాల్‌రెడ్డికే చెల్లింది. కల్యాణలక్ష్మిపై కోర్టు ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో పేదల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదు?” అని ప్రశ్నించారు.ప్రజా సమస్యలపై రాజగోపాల్‌రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదని విమర్శించారు. మంత్రి పదవి కావాలని ఒకసారి, పదవులు అవసరం లేదని మరోసారి మాట్లాడటం ప్రజలను అయోమయానికి గురిచేస్తోందన్నారు.

**బీఆర్ఎస్ హయాంలోనే మునుగోడు అభివృద్ధి** తన హయాంలో మునుగోడు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్, చండూరు రెవెన్యూ డివిజన్లు, మర్రిగూడ, చౌటుప్పల్‌లో ఆసుపత్రులు, పైలాన్ పార్క్, గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, అంతర్గత రహదారులు, శివన్నగూడెం ప్రాజెక్టు, చండూరులో వివిధ రహదారి అభివృద్ధి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని పేర్కొన్నారు.“మంత్రి పదవి వస్తేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందనుకోవడం సరికాదు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ప్రజల కోసం పనిచేసే చిత్తశుద్ధి ఉండాలి. పదవులు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజల సమస్యలే ముఖ్యమని గుర్తించాలి” అని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో తెలంగాణ ప్రజలు, మునుగోడు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పేదల పక్షాన నిలబడి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమ పథకాలను కాపాడే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం చేస్తుందని కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఆత్మగౌరవం కోసం పోరాటం విజయం సాధించే వరకు ఉద్యమం

**- శిలా ఫలకల్లో ఉపసర్పంచ్ పేరు చేర్చాలి.**

**- సింగం శ్రావణి- ప్రశాంత్ ఉపసర్పంచ్ నెక్కొండ.**

**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 17:** వరంగల్ జిల్లా అధ్యక్షులు దండా నరేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపసర్పంచ్ ఫోరం అధ్యక్షులు బోట్ల కార్తీక్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నెక్కొండ మండల ఉప సర్పంచ్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం శ్రావణి ప్రశాంత్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిపాలనలో ఉప సర్పంచ్‌లు మరియు వార్డు సభ్యులు ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ, గ్రామ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులుగా వారికి తగిన గౌరవం, గుర్తింపు, అధికారాలు మరియు హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.ఉప సర్పంచ్‌లకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా ముందుకు సాగాల్సిన



సమయం ఇది.మనసమస్య ఒక్కరిది కాదు మనహక్కు అందరిది మనపోరాటం భవిష్యత్ తరాల కోసం ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్,విధులు అధికారాల్లో స్పష్టత,గౌరవ వేతనం,వార్డు సభ్యులకు తగిన గౌరవం,గ్రామ అభివృద్ధిలో సముచిత భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రభుత్వంతో చర్చించి న్యాయం సాధించేందుకు ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలవాలని రాజకీయాలకు అతీతంగా ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులందరూ ఒకే వేదికపైకి వచ్చి ఐక్యతను చాటాలన్నారు . మన ఐక్యతను చూసేలా, మన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకురావాలని ఉప సర్పంచ్‌ల హక్కుల సాధన కోసం గ్రామ స్వరాజ్యం కోసశీ ప్రజల సంక్షేమం కోసశీ మనమంతా ఒక్కటై ముందుకు సాగాలన్నారుఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఉపసర్పంచ్లు నాయకులు వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా సమ్మయ్య గౌడ్.. బాధిత కుటుంబానికి బాసటగా కాంగ్రెస్

**కష్టకాలంలో చేయూతే నిజమైన సేవ పాస్టర్ జీవన్, ఎన్టీఆర్ నగర్ ప్రజలు**

**50 కిలోల బియ్యంతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకుల అందజేత**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 17:** కేసముద్రం: ప్రజల కష్టాల్లో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ అన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సోమారపు సామెల్ మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని సమ్మయ్య గౌడ్ పరామర్శించారు.మృతుడి భార్య ముత్తమ్మ, కుమారుడు యాకుబ్బు ఓదార్చి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ పేదలు, నిరుపేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ముందుండి సహాయం చేయడం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా, సమ్మిగౌడ్ ఫౌండేషన్ స్థాపకుడిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా సేవకు ప్రాధాన్యతనిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు.కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన సమ్మయ్య గౌడ్‌ను పాస్టర్ జీవన్‌తో పాటు ఎన్టీఆర్ నగర్ ప్రజలు అభినందించారు.ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ వల్లందాస్ ఉమా రవి, కాంగ్రెస్ నాయకులు చిట్ల సంపత్, కీర్తి సురేందర్, మాసాడి శ్రీనివాస్, అజ్మీర రమేష్, పోలపల్లి వెంకటరెడ్డి, కత్తెరశాల శ్రీనివాస్, ఎన్నమాల మహేందర్, పాస్టర్ జీవన్, రమేష్ నాయక్, సోమ్కండ్ల సుభాష్ రెడ్డి, సంకపల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లికుదురు ప్రజావాణికి వెల్లువెత్తిన వినతులు.. 18 అర్జీలు స్వీకరణ

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారుల చర్యలు**

**క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామన్న ఎంపీడీవో**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 17:** నెల్లికుదురు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 18 అర్జీలు అందాయి. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సింగారపు కుమార్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి ప్రజలకు త్వరితగతిన పరిష్కారం అందేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.



# సీనియర్ నేత కాసుల రత్నయ్య కన్నుమూత

# బీజేపీ కుటుంబానికి తీరని లోటు

**- జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సంతాపం.**







**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 17:** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం, నెక్కొండ మండలం, రెడ్లవాడ గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, పార్టీకి వెన్నెముక లాంటి కాసుల రత్నయ్య మనల్ని విడిచి వెళ్లారు. ఈ దుర్వార్త విన్న వెంటనే బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి బీజేపీ నాయకులతో కలిసి రత్నయ్య నివాసానికి వెళ్లి అంతిమ వీడ్కోలు తెలిపారు. పూలమాలలు అర్పించి, పార్టీ కాషాయ జెండాతో అంతిమ గౌరవం ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.కాసుల రత్నయ్య మాటల్లో కాదు చేతల్లో నమ్మిన నాయకుడు. నెక్కొండ మండలంలో పార్టీ బీజం వేసి, దాన్ని వటవృక్షంగా మార్చిన క్రమశిక్షణ కలిగిన కార్యకర్త. ఆయన త్యాగం, నిబద్ధత మనందరికీ ఆదర్శం. రత్తయ్య మరణం పార్టీకి పూడ్చలేని నష్టం అని అన్నారు.రత్నయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు ఈ కఠిన సమయంలో ఆ భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని కోరుకున్నారు,ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాశ్రీశ్రీ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, బన్న ప్రభాకర్, కూడికల శ్రీధర్, మండల అధ్యక్షులు నాయిని అశోక్, బీజేపీ నియోజకవర్గ నాయకులు జూలూరి మనీష్ గౌడ్, అంబాల రాంగోపాల్, శ్రీరంగం సాగర్ బిజెపి నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐను కలిసిన బత్తిని అనిల్

**● శాలువా కప్పి అభినందనలు తెలిపిన ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షులు**




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 17:** నెల్లికుదురు ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గంగారపు కర్ణాకర్‌ను ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షులు బత్తిని అనిల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు గడ్డల రాము, ఎర్రబెల్లిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు గజ్జి అశోక్, బడితండా అధ్యక్షులు భూక్యా వీరన్న, భాస్కర్ పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ బోనాలకు అంబరాన్నంటిన భక్తి సంబరాలు

**బోనమెత్తిన మహిళలు.. పోతురాజుల ఆటలు, శివశక్తుల నృత్యాలతో సందడి**

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జాటోత్ హుస్సేన్ నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 17:** కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో ముత్యాలమ్మ బోనాలు వైభవంగా జరిగాయి. వైస్ చైర్మన్ అల్లం రమ నాగేశ్వరరావు, జాటోత్ సుజాత హరీష్ నాయక్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్, చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, కౌన్సిలర్ బానోత్ అరుణ దేవేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మాజీ చైర్మన్ నీలం దుర్గేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కేజీబీవీ విద్యార్థినీలు ఎంపిక

**కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కంది భవాని**






**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగష్టు 17:** చౌటుప్పల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో చౌటుప్పల్ పట్టణంలోని కేజీబీవీ విద్యార్థినీలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కంది భవాని మాట్లాడుతూ.. అండర్-14, అండర్-18 విభాగాల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినీలు వివిధ అథ్లెటిక్స్ విభాగాలకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హనుమకొండ జిల్లాలోని జవహర్‌లాల్ నెహ్రూ అథ్లెటిక్స్ స్టేడియంలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న 12వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-14, అండర్-16, అండర్-18, అండర్-20 బాలబాలికల సౌత్ జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు విద్యార్థినీలు ఎంపికైనట్లు తెలిపారు. **అండర్-18 విభాగంలో..** ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినీలు పి. అంజలి శ్రీ, ఎం. పూజిత, వి. శ్రావణి, ఎం. సిరి, ఆర్. రమ్య శ్రీ, ఏ. అక్షయ, బి. అమృత అండర్-18 విభాగంలో వివిధ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. **అండర్-14 విభాగంలో..** 8, 9వ తరగతులకు చెందిన బి. మన్విత, కే. అక్షర, ఏ. మోక్ష శ్రీ, ఎస్‌కే. నాస్య వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కంది భవాని మాట్లాడుతూ.. ఈనెల 26, 27 తేదీల్లో జరిగే సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థినీలు ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు, కేజీబీవీ పాఠశాలకు, చౌటుప్పల్ పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థినీలను క్రీడల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దడంలో కృషి చేస్తున్న పీ.ఈ.టీ అనితను స్పెషల్ ఆఫీసర్ కంది భవాని అభినందించారు. విద్యార్థినీలు ఇదే స్ఫూర్తితో క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

# కాసుల రత్తయ్య కుటుంబాన్ని ఓదార్చి, పరామర్శించిన నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్

**-నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి**



**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 17:**వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని రెడ్లవాడ గ్రామానికి చెందిన కాసుల రత్తయ్య ఉదయం ఐదు గంటలకు స్వర్గస్థులయ్యారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందకు విచ్చేసిన నెక్కొండ మండల మార్కెట్ చైర్మన్ హరీష్ రెడ్డి మరియు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచు పెండ్యాల హరిప్రసాద్, నెక్కొండ మండల అధ్యక్షులు లౌడియా తిరుమల్ చౌహాన్ మరియు వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు దుదిమెట్ల రాజమౌళి, మార్కెట్ డైరెక్టర్ దుదిమెట్ల కొమురయ్య, మాజీ ఉపసర్పంచ్ వీరభద్రం, మార్కెట్ డైరెక్టర్ రత్నం, తదిరిలు పాల్గొన్నారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా కాసుల రత్తయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# రైతుల గోస పట్టని కాంగ్రెస్ సర్కార్

**- చేతకాకపోతే గద్దె దిగండి**

**- కాళేశ్వరం రిపేర్ చేసి 15 రోజుల్లో నీళ్లిస్తాం**

**- ఎర్రబెల్లి దయాకర్ రావు**

**- ఎస్సారెస్పీ కాల్వ వెంబడి 10 కి.మీ.పాదయాత్ర**

**- కదం తొక్కిన 5 వేల మంది రైతులు**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూరు ప్రతినిధి (సాంబ పస్తం),ఆగస్టు17:** ఎస్సారెస్పీ కాల్వలకు వెంటనే సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. పరిపాలన చేతకాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగిపోవాలి.కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయించి నీళ్లు ఇవ్వడం మీ వల్ల కాకపోతే మాకు అప్పగించండి...కేవలం 15 రోజుల్లోనే రిపేర్లు పూర్తి చేసి ప్రతి ఎకరానికీ నీళ్లు అందిస్తాం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు ఘాటుగా హెచ్చరించారు. రాయపర్తి మండలం మైలారం రిజర్వాయర్ నుండి తొర్రూరు మండలం నాంచారిమడుర్ వరకు ఎస్సారెస్పీ కాల్వ వెంబడి సుమారు 10 కిలోమీటర్ల మేర ఎర్రబెల్లి చేపట్టిన పాదయాత్ర గులాబీ దండును తలపించింది. వందలాదిగా ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తూ సాగిన ఈ యాత్రకు పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి, పెద్దవంగర, తొర్రూరు మండలాల నుంచి సుమారు 5వేల మందికి పైగా రైతులు కదలివచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ...కండ్ల ముందే వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నా,నీళ్లు లేక పొలాలను పక్కన పెడుతున్నా ఈ ప్రభుత్వానికి కనీసం చిత్తశుద్ధి లేకపోవడం దారుణమన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, రైతులను నిలువునా మోసం చేస్తోందని మండిపడ్డారు. **రూ.25 వేల నష్టం:** వర్షాకాలంలో నీళ్లు వస్తాయనే ఆశతో వరి నాట్లు వేసిన రైతులకు నీరందక ఎకరాకు రూ. 25వేల చొప్పున భారీగా నష్టం వాటిల్లుతోంది. **అధికారుల నిర్లక్ష్యం:** అధికారులు నీటి విడుదలపై చేతులెత్తేస్తూ, ప్రభుత్వం నుంచే నీళ్లు ఇవ్వొద్దని ఆదేశాలు ఉన్నాయని చెబుతుండటం శోచనీయం. రోజుకో సభ పెట్టి ప్రజల సొమ్ము గుల్ల చేయడం తప్ప, రైతులకు ఏం చేయాలో తెలియని వ్యక్తి సీఎంగా ఉండటం సిగ్గుచేటు అని ఎర్రబెల్లి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. **పథకాలన్నీ బంద్ చేసే కుట్ర:** రైతు బంధు ఎగగొట్టడమే కాకుండా యూరియా దొరకక, విద్యుత్ కష్టాలతో రైతులు ఆగం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. **రైతు భీమా నిర్లక్ష్యం:** ఈ నెల 14తో రైతు భీమా ప్రీమియం చెల్లింపు గడువు ముగిసినా ప్రభుత్వానికి సోయి లేకపోవడం దారుణం.**పంట బోనస్ కుట్ర: పంటలకు నీళ్లిస్తే దిగుబడి వచ్చి** కేసీఆర్ కు మంచి పేరు వస్తుందని, అలాగే బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే నెపంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పొట్ట కొడుతోంది. **కల్యాణ లక్ష్మిపై హైకోర్టు స్టే ప్రభుత్వానిది డ్రామా?:** పేదింటి ఆడబిడ్డ పెళ్లికి భారం కాకూడదని రైతుల గోస పట్టని కాంగ్రెస్ సర్కార్ తీసుకొచ్చిన కల్యాణ లక్ష్మి పథకాన్ని కూడా నిలిపివేసేందుకు కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ఎన్నికల వేళ తులం బంగారం ఇస్తామని మోసం చేసి, ఇప్పుడు హైకోర్టులో స్టే విధించినా కనీసం 4 వారాలుగా కౌంటర్ దాఖలు చేయలేని పక్షపాత స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. తులం బంగారం అడుగుతారనే భయంతోనే ఈ పథకాన్ని అటకెక్కించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు.కేసీఆర్ కిట్టు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగిస్తూ తులం బంగారం ఇవ్వకపోతే మహిళలే కాంగ్రెస్ నేతలను తన్ని తరుముతారు...**తస్మాత్ జాగ్రత్త-ఎర్రబెల్లి దయాకర్ రావు** ఈ భారీ పాదయాత్ర కార్యక్రమంలో వరంగల్, మహబూబాబాద్ జిల్లాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల ముఖ్య నాయకులు, వేలాది మంది రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో వందేమాతరం గీతాలాపనతో బీజేవైఎం నిరసన

**● జాతీయ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది: బీజేవైఎం నాయకులు**




**తొలి అక్షరం/చౌటుప్పల్ ఆగష్టు 17:** కాంగ్రెస్ నాయకులు జాతీయ గీతం, వందేమాతరం పట్ల అవమానకరంగా వ్యాఖ్యానించారని ఆరోపిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తంగడిపల్లి రోడ్డులోని నేతాజీ విగ్రహం వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి, విద్యార్థులు, బీజేవైఎం నాయకులు కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపిస్తూ దేశభక్తిని చాటుకున్నారు.బీజేవైఎం చౌటుప్పల్ మండల అధ్యక్షుడు పబ్బు వంశీ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. దేశభక్తి, జాతీయ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేవైఎం నల్గొండ జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సతీష్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపిన వందేమాతరం గీతాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. జాతీయ చిహ్నాలు, జాతీయ గీతాలు, దేశభక్తికి సంబంధించిన ప్రతీకలను రాజకీయాలకు అతీతంగా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.భవిష్యత్ తరాలకు దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, స్వాతంత్ర్య ఉద్యమ విలువలను తెలియజేయాలని విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిండు భాస్కర్, బీజేపీ చౌటుప్పల్ పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల భిక్షం గౌడ్, సీనియర్ నాయకులు రమణ శంకర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, బత్తుల జంగయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురేష్, చిరంజీవి, పోలేపల్లి లక్ష్మి, ఉడుగు వెంకటేశం, బీజేవైఎం నాయకులు ఉష్కాగుల నాగరాజు, పందుల శరత్ కుమార్, గౌతమ్, ప్రకాష్, కార్తీక్, సన్నీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.స్థానిక ప్రజలు కూడా కార్యక్రమంలో పాల్గొని వందేమాతరం గీతాన్ని ఆలపిస్తూ దేశభక్తిని చాటుకున్నారు.

# అజ్మీర తండాలో కాంగ్రెస్ కొత్త కమిటీ ఎన్నిక

- గ్రామ అధ్యక్షుడిగా బానోతు రమేష్ ఏకగ్రీవం..
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్న నూతన అధ్యక్షుడు






**తొలిఅక్షరం/నర్సింహులపేట ఆగస్టు 17 :** అజ్మీర తండా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ అజ్మీర సేవ్య నాయక్, ఉప సర్పంచ్ నరేష్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బ సోమిరెడ్డి, సమన్వయ కమిటీ చైర్మన్ దస్రు నాయక్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బానోతు రమేష్, యూత్ అధ్యక్షుడిగా అజ్మీర వీరన్న సోనియా, ఉపాధ్యక్షులుగా అజ్మీర సేవ్య, ప్రధాన కార్యదర్శిగా అజ్మీర మురళి, కార్యదర్శిగా భూక్యా యాకుబ్, కోశాధికారిగా అజ్మీర రామ్మూర్తి తదితరులను ఎన్నుకున్నారు. వివిధ సెల్‌లకు, బూత్ స్థాయికి కూడా బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బానోతు రమేష్ మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తల సహకారంతో గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబాల రామ్ గోపాల్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న బిజెపి నాయకులు

- నర్సంపేట అడ్వకేట్ అంబాల సుధీర్ గౌడ్ పెద్దకుమారుడు





**తొలి అక్షరం/నెక్కొండ ఆగస్టు 17:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన అందాల సుధీర్ నాన్న అయినా అంబాల రాంగోపాల్ గౌడ్ ఆయురారోగ్యాలతో ఇలాంటి జన్మదిన వేడుకలు మరన్నో జరుపుకొవలనని ఆ భగవంతుడిని కోరుకుంటూ జన్మదిన శు భాకాంక్షలు. ఈ సందర్భంగా పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న ఎర్రబెల్లి సంపత్ రావు, పుట్టపాక యాదగిరి, భూపతి వీరన్న, నాయిని అశోక్, సొంటిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, రాపాక సందీప్, రాజు, సాశీబవి నరేష్ , అంబాల సుధీర్ కుమార్ అడ్వకేట్ నర్సంపేట కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి వెల్లువెత్తిన అర్జీలు

- ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా అధికారుల చర్యలు




**తొలిఅక్షరం/నర్సింహులపేట, ఆగస్టు 17:** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా నర్సింహులపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించారు. సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాంప్రసాద్, తహసీల్దార్ రమేష్‌బాబు, వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్,సుగుణాకర్ తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ నేతలతో శ్రీవర్ధన్ రెడ్డి చర్చ



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు17:** బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తిరుమల శ్రీవారి దర్శనం సందర్భంగా తీసుకువచ్చిన శ్రీవారి ప్రసాదాన్ని రాష్ట్ర అధ్యక్షుడికి అందజేశారు. అనంతరం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ డా. కె. లక్ష్మణ్, తమిళనాడు పార్టీ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డిని కలిసి శ్రీవారి ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా రాబోయే హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై నాయకులతో చర్చించినట్లు శ్రీవర్ధన్ రెడ్డి తెలిపారు. పట్టభద్రుల సమస్యలు, ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పట్టభద్రులను కలుపుకొని ముందుకు వెళ్లేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై కూడా నాయకులతో చర్చించినట్లు తెలిపారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరణకు అప్పగించొద్దు

- పేదలకు సాంకేతిక విద్య దూరం చేయొద్దు: ఎస్ఎఫ్ఐ




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 17:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరణ, పీపీపీ విధానాలకు అప్పగించరాదని ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ సెక్రటరీ వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. డిప్లొమా, పాలిటెక్నిక్ విద్యను సివిల్ యూనివర్సిటీల్లో విలీనం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. పేద, మధ్యతరగతి, గ్రామీణ విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. G.O.Ms.No.97లో పాలిటెక్నిక్‌లకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని, వాటిని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో విలీనం చేయబోమని స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు.సాదీుజు బోర్డు పాత్రను కొనసాగించాలని, అధ్యాపకులు, సిబ్బంది సర్వీస్ నిబంధనలకు రక్షణ కల్పించాలని శ్రీకాంత్ అన్నారు. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో అధ్యాపకుల నియామకంతో పాటు ల్యాబ్‌లు, హాస్టళ్లు, భవనాలు, పరికరాలు, మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. శక్తి పాలసీని వెనక్కి తీసుకుని ప్రభుత్వ సాంకేతిక విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అదిల్, చరణ్, రాంచరణ్, తరుణ్, బబ్లు, రాజేష్, రాకేష్, భానువంశీ, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇ.ఎల్.వి. భాస్కర్ జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు

- చౌటుప్పల్‌లో ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం, రక్తదాన శిబిరం

**తొలి అక్షరం/చౌటుప్పల్:ఆగస్టు 17:** విద్య, వైద్యం, ఉపాధి ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో సమాజ సేవలో ముందుకు సాగుతున్న ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆగస్టు 18న పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా చౌటుప్పల్‌లోని నాగులకుంట సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. యువత, అభిమానులు, సేవాభావం కలిగిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. “ఒక్కొక్కరి రక్తదానం మరొకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుంది. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవచ్చు” అని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. సమాజ సేవను నిరంతరం కొనసాగిస్తూ విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రజలకు అండగా నిలవడమే ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఆగస్టు 18న నిర్వహించే సేవా కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

# దూసకల్ ప్రభుత్వ పాఠశాలలో క్రీడలపై అవగాహన

- విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీస్తాం



**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 17:** దూసకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, మండల, రాష్ట్ర స్థాయి పోటీలకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారు. శ్వేత యాదవ్ ఆధ్వర్యంలో కబడ్డీ, లగోరి కోచ్‌లు విద్యార్థులతో మాట్లాడి క్రీడల ప్రాధాన్యాన్ని వివరించారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రమశిక్షణతో సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వర్షిత్, పి.కిరణ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్వేత యాదవ్, కోచ్‌లను అభినందించారు.

# వరంగల్‌లో తొలిసారిగా 100కు పైగా స్టాల్స్‌తో వరంగల్ బిజినెస్ అండ్ స్టార్టప్ ఎక్స్పో - 2026




**తొలి అక్షరం/ హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ నగరంలో తొలిసారిగా వ్యాపార సంస్థలు,స్టార్టప్స్, పెట్టుబడి దారులు, పారిశ్రామి కవేత్తలు, యువ వ్యాపారవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో వరంగల్ బిజినెస్ అండ్ స్టార్టప్ ఎక్స్పో - 2026 ను ఆగస్టు 22, 23 తేదీల్లో భారీ స్థాయిలో నిర్వహించనున్నారు. ఈ ఎక్స్పో లో 100కు పైగా స్టాల్స్ ను ఏర్పాటు చేయనున్నారు. వివిధ రంగాలకు చెందిన వ్యాపార సంస్థలు, స్టార్టప్స్ తమ ఉత్పత్తులు,సేవలు,కొత్త ఆలోచనలు,వ్యాపార నమూనాలను ప్రజలకు పరిచయం చేసుకునే అవకాశం కల్పించనున్నారు. స్టార్టప్స్ కు పెట్టుబడిదారులతో నేరుగా పరిచయాలు ఏర్పరచుకోవడం,తమ ఆలోచనలకు పెట్టుబడులు,కొత్త అవకాశాలు పొందడం,వ్యాపార సంస్థలకు తమ ఉత్పత్తులు,సేవలకు విస్తృత ప్రచారం కల్పించడం ఈ ఎక్స్పో ప్రధాన ఉద్దేశం. అలాగే వివిధ రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు,పెట్టుబడిదారులు,పారిశ్రామికవేత్తలు ఒకే వేదికపై కలుసుకోవడం ద్వారా కొత్త వ్యాపార భాగస్వామ్యాలు, అవకాశాలకు మార్గం ఏర్పడనుంది. ఈ ఎక్స్పో కోసం ఇప్పటికే విస్తృత స్థాయిలో డిజిటల్ మార్కెటింగ్,ప్రత్యక్ష ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,పెద్ద సంఖ్యలో సందర్శకులు హాజరవుతారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. వరంగల్‌లోని వ్యాపార, స్టార్టప్ రంగానికి ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి,స్థానిక వ్యాపారాలు,కొత్త ఆలోచనలకు మరింత గుర్తింపు,అవకాశాలు,ప్రోత్సాహం కల్పించడమే ఈ ఎక్స్పో ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో ఫౌండర్స్ నితిన్,అనిల్ సభ్యులు అశ్విని,మణికంఠ,గౌతమ్,అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల అనుసంధానం వద్దు: ఏఐఎస్ఎఫ్





**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు 17:** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుసంధానం చేసేలా జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి షాద్‌నగర్ ఆర్డీవో, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను పీపీపీ విధానంలోకి తీసుకెళ్లడం ద్వారా పేద విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలల్లో మౌలిక వసతులు, ల్యాబ్‌లు మెరుగుపరచడంతో పాటు అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ




**తొలి అక్షరం/షాద్ నగర్, ఆగస్టు17:** లింగందన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఉచితంగా షూస్ పంపిణీ చేశారు. విద్యార్థుల సౌకర్యం, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టడం ఎంతో అభినందనీయమని పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగిళ్ల వెంకటే, హెచ్ఎం రవికుమార్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గుబ్బ సుదర్శన్ పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు నాగిళ్ల కృష్ణయ్య, గొడుగు రాములు, రఘుపతి రెడ్డితో పాటు ఉపాధ్యాయుడు అజయ్, పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

# రామన్న పేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 17:** రామన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజున నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4 దరఖాస్తులు రావటం జరిగింది. 2 మండల పంచాయతీ అధికారి, 1 తహసీల్దార్, 1,ఏ ఈ ఇరిగేషన్ 1,, ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ ఆవుల రాములు, తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీవో రఫీ, సిపిడిఓ వెంకటరమణ ఏ ఈ, లు ఆశిష్ రాఘవ, సురేష్, నవీన్,, ఏ పి వో వెంకన్న, మెడికల్ ఆఫీసర్, ఎం ఈ వో సురేందర్ రెడ్డి,, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కళ్యాణి ,ఇరిగేషన్ ఏఈ రాజేశ్వరి ఎలక్ట్రిసిటీ అధికారులు బీసీ సంక్షేమ అధికారులు పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు

# గల్లీ బాయ్స్ యూత్ ఆర్థిక సహాయం

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 17:** ఈటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో ముత్యాల శివ మృతి చెందిన విషయం తెలుసుకుని వారి కుటుంబానికి మా వంతు సహాయంగా గల్లీ బాయ్స్ 9600 రూపాయలు ఇవ్వటం జరిగింది



# కళ్యాణలక్ష్మీపై గళమెత్తిన బీఆర్ఎస్.. పేదింటి ఆడబిడ్డలకు అండగా పోరుబాట

**కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి వెన్నాకుల శ్రీను**

**పథకాలను రద్దు చేసే యత్నాలను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలి**

**కేటీఆర్ పిలుపుతో మండల కేంద్రంలో బీఆర్ఎస్ భారీ ధర్నా.. తహసీల్దార్‌కు వినతిపత్రం**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఆగస్టు 17:** నెల్లికుదురు మండల కేంద్రం: పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, వారి తల్లిదండ్రులకు అండగా నిలుస్తున్న కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మహబూబాబాద్ తొర్రూరు ప్రధాన రహదారిపై నిర్వహించిన ధర్నాతో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ చంద నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీను మాట్లాడుతూ.. కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు కేవలం ఆర్థిక సాయం అందించే పథకాలు కాదని, పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, తల్లిదండ్రుల భరోసాకు ప్రతీకలని అన్నారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డ వివాహం భారంగా మారకుండా కేసీఆర్ ప్రభుత్వం ఈ పథకాలను ప్రవేశపెట్టి వేలాది కుటుంబాలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపి సంక్షేమ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదని ఆయన మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మీ పథకానికి మరో తులం బంగారం జతచేసి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా.. ఇప్పటికే అమలులో ఉన్న పథకాన్నే నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయడం పేదల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని శ్రీను విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను రూ.51 వేలతో ప్రారంభించి దశలవారీగా ఆర్థిక సాయాన్ని పెంచిందని తెలిపారు. పేద కుటుంబాల కన్నీళ్లు తుడిచే సంక్షేమ పథకాలను కొనసాగించాల్సిందేనని స్పష్టం చేశారు. "పేదింటి ఆడబిడ్డ పెళ్లి అంటే ఆ కుటుంబానికి పండుగ కావాలి.. ఆర్థిక భారం కాకూడదు. అలాంటి కుటుంబాలకు అండగా నిలిచే కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. పేదల హక్కుల కోసం అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం" అని వెన్నాకుల శ్రీను హెచ్చరించారు. మేచరాజుపల్లి సర్పంచి తూర్పా టి శంకరయ్య, నెల్లికుదురు బిఆర్ఎస్ మాజీ ఎంపి టిసి ఫోరం అధ్యక్షులు బత్తిని అనిల్ గౌడ్ ఎర్రబెల్లి నవీన్‌రావు, భోజ్యా నాయక్, భీముడు, ఎండీ రహమాన్, ఎడ్ల మహేష్, హెచ్చు అశ్విన్, గణేష్ తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## సోషల్ జస్టిస్ చేసిన మహనీయులు కెసిఆర్...

**● పరకాల ఎమ్మెల్యే పేరు మరిచి పోయిన రేవంత్ రెడ్డి...**




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్,మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ... ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అబద్ధాలు చెప్పి 3 సంవత్సరాల కాలం గడిపాడు. కెసిఆర్ నిర్మాణం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ను రేవంత్ రెడ్డి ప్రారంభించారని ఎద్దేవా చేశారు. కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత కుటుంబ పెద్దగా ఆలోచించి అన్ని వర్గాలకు సమన్యాయం చేయాలని అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని,దళితులను ధనవంతులు చేయాలని దళిత బంధు పథకాన్ని అమలు చేసిన ఘనత కేసిఆర్ కే దక్కుతుందన్నారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నది నవ్వు చేసిన అభివృద్ధి ఏదని,బి ఆర్ ఎస్ నాయకులకు నీ కంటే ఎక్కువ తిట్లు వచ్చున్నారు. రేవంత్ రెడ్డి అన్ని పార్టీలు తిరిగి కాంగ్రెస్ లోకి వచ్చాడు కానీ సోషల్ జస్టిస్ చేసిన మహనీయులు కెసిఆర్ అని అన్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం అందించే కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ పథకాలను అమలు కాకుండా కోర్టు లో నీ మిత్రుడి తో పిల్ వేయించి స్టే తెప్పించి,ఇప్పటి వరకు కౌంటర్ దాఖలు చేయలేదు అని కల్యాణలక్ష్మి పథకాన్ని ఆపాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ ఉద్యమం చేసి కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధించుకున్నాం అన్నారు. రానున్న రోజుల్లో 420 హామీలను అమలు చేయకుంటే నిన్ను నీ పార్టీనీ తరిమి తరిమి కొడతారు. కేసీఆర్ ను తిట్టడం తప్ప పరకాలకు ఇచ్చింది ఏం లేదన్నారు. కేసీఆర్ ను తిట్టడం కోసమే మీటింగ్ లు పెడుతున్నారని అన్నారు. కేసీఆర్ తీసుకువచ్చిన కాకతీయ టెక్స్టైల్ పార్క్ ను తీసుకువచ్చారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అనేక సార్లు చెప్పాడు. రైతులకు సమయానికి యూరియా ఇవ్వలేకపోతున్నారన్నారు. రేవంత్ రెడ్డి... పరకాల ఎమ్మెల్యే పేరునే మరిచిపోయాడన్నారు. స్టేజి పక్కనే నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్ ను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా బి ఆర్ ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లకు తరలించారు. ప్రజాధనాన్ని వృధా చేయడానికే మీటింగ్ లు పెడుతున్నారని ఈ సందర్భంగా అన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 17:** రామన్నపేట పట్టణంలోని దుబ్బాక రోడ్డులో ఉన్న స్మశాన వాటిక, వెంకట్రామయ్య చిన్న చెరువు అలుగు వద్ద పరిసరాలు అన్నిటిని అపరిశుభ్రతకు గురి చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని ప్రజావాణిలో వినతి... ఇక్కడ చెత్త వేయడం మూలంగా పందులకు, కుక్కలకు, కోతులకు ఆవాసాలుగా మారాయి. రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనాల పై దాడి చేస్తూ వాహనదారులను గాయపరుస్తున్న సంఘటనలు కూడా నెలకొన్నాయి. రామన్నపేట పట్టణానికి చెందిన కొందరు పాత ఇనుప సామాను వ్యాపారస్తులు ఇనుప సామాను కొనుగోలు ద్వారా వచ్చిన వ్యర్థాలను, ట్రాక్టర్ యాజమాన్యాలు పాత ఇల్లు కూలగొట్టడం ద్వారా వచ్చిన వ్యర్థాలను, యాటలను కోసే వారు, మాంసాన్ని విక్రయించేవారు అందులో వచ్చే తోలు, బొక్కలు ఇతర వ్యర్థాలను, కొందరు వ్యక్తులు తమ ఇండ్లలో వచ్చే చెత్త ఇతర వాటిని ఈ ప్రాంతంలో వేయడం వల్ల ఇది డంపు యార్డ్ గా మారిపోయింది. స్మశాన వాటిక మొత్తం అపరిశుభ్రంగా తయారై దుర్గంధాన్ని వెదజల్లుతూ పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. చెరువు అలుగు పోసే ప్రాంతంలోనే ఇవి వేయడం వల్ల చెరువు నుండి అలుగు పారితే నీరు పోవడానికి ఇబ్బందులు ఏర్పడి చెరువు కట్ట కు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. కావున సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి, చెత్తను వేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో పట్టణ ప్రజలు కోరినారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: వరంగల్ జిల్లా అధ్యక్షులు గాజే వేణుగోపాల్





**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ అధ్యక్షతన టీఎన్జీవో స్ భవన్ హైదరాబాద్ లో జరిగింది. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు గాజే వేణుగోపాల్ మాట్లాడుతూ... ఉద్యోగుల సంక్షేమం, హెల్త్ కార్డుల త్వరిత అమలు,పీఆర్సీనీ వెంటనే ప్రకటించాలని మరియు సిపిఎస్ సమస్యను పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మొట్టమొదటిసారిగా టీఎన్జీవోస్ జెండా,కండువా ను మరియు ఉద్యోగుల గొంతుక పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్,ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ లు నిరంతరం కృషి చేస్తు సమస్యలు పరిష్కరిస్తారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గజ్జల రామ్ కిషన్ ను,అలాగే నూతన అధ్యక్ష,కార్యదర్శులుగాజే వేణుగోపాల్,పాలకుర్తి సదానందం లను సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం,కోశాధికారి కిరణ్,రాష్ట్ర కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు,హన్మకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుల రాజేందర్,సోమయ్య, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు బూరుగు రవి,జనగాం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖాజా షరీఫ్,శ్రీనివాస్ ములుగు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోల రాజు,మేడి చైతన్య,రాష్ట్రవ్యాప్తంగా వున్న అన్ని జిల్లా నుండి అధ్యక్షులు కార్య దర్శులు పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

# అమ్మానాన్నల ఆశయాలే మాకు మార్గదర్శకం

**- తొర్రూరు పిఎసిఎస్ చైర్మన్,డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్**

**- అనసూర్యమ్మ స్మారక సేవా కార్యక్రమాలు ఘనంగా ముగింపు**





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూరు ప్రతినిధి(సాంబ పస్తం),ఆగస్టు17:** తొర్రూరు పిఎసిఎస్ చైర్మన్,డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్ మాతృమూర్తి,స్వర్గీయ అనసూర్యమ్మ జ్ఞాపకార్థం అనసూర్యమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల దివ్యస్మరణ, సేవా కార్యక్రమాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశంలో డిసిసిబి డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్ మాట్లాడుతూ.. మా అమ్మ అనసూర్యమ్మ జీవితాంతం పదిమందికి సహాయపడుతూ,మానవతా విలువలతో బతికారు. ఆ సేవాభావమే మా కుటుంబానికి శ్రీరామరక్ష. అమ్మానాన్నలు నేర్పిన ఆశయాలు,సమాజానికి మేలు చేసే గుణమే నన్ను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టాయి. వారి దివ్యస్మరణార్థం చేపట్టిన ఈ మూడు రోజుల సేవా కార్యక్రమాలను విజయవంతం చేసిన ఊరి ప్రజలకు, శ్రేయోభిలాషులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. భవిష్యత్తులోనూ అనసూర్యమ్మ ట్రస్ట్ ద్వారా మరిన్ని సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు అండగా ఉంటాం అని పేర్కొన్నారు. **అలరించిన ఆధ్యాత్మిక,అన్నదాన కార్యక్రమాలు:** మూడు రోజుల పాటు గ్రామంలో భక్తిశ్రద్ధలతో దివ్యస్మరణ పూజలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనసూర్యమ్మ చూపిన సేవాభావం, మానవతా విలువలను స్మరించుకుంటూ నిరుపేదలకు, భక్తులకు విస్తృతంగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ముగింపు వేడుకలకు తొర్రూరు పరిసర ప్రాంతాల నుంచి గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కాకిరాల హరిప్రసాద్ అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై అనసూర్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాల్గొని సహకరించిన ప్రతి ఒక్కరికీ అనసూర్యమ్మ ట్రస్ట్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## సర్పంచుల జాక్ రాష్ట్ర కార్యదర్శిగా గర్దాస్ విక్రమ్ ఎన్నిక



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 17:** హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ల జాక్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకోబడిన ఇంద్రపాల నగర సర్పంచ్ గర్దాస్ విక్రమ్ కి నియామక పత్రాన్ని అందజేసిన తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు రాష్ట్ర సర్పంచుల సంఘం జాక్ గౌరవ అధ్యక్షులు వి శ్రీనివాస్ గౌడ్ సర్పంచ్ ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య కార్యక్రమంలో వివిధ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు సర్పంచులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఆర్థిక సహాయం అందించిన దైద

**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 17:** కొప్పులు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త దుర్గం తిరుమలేష్ మృతి చెందడంతో వారి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి దహన సంస్కారాలకు (5000 )వేలు రూపాయలు ఆర్థిక సాయం అందజేసి కుటుంబ సభ్యులను ఓదార్చిన దైద రవీందర్తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి కొప్పోలు గ్రామ సర్పంచ్ జ్ఞానలత వెంకటరెడ్డిమాజీ ఎంపిపి శేఖర్ కొప్పూరు గ్రామ శాఖ అధ్యక్షుడు కప్పల సైదులు గౌడ్ దుర్గం శంకర్ చింతమల్ల శీను బాలు లక్ష్మయ్య రవి రమేష్ విక్రమ్ లింగయ్య మురళి మల్లేష్ సైదులు తదితరులు పాల్గొన్నారు



## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న వేముల



**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 17:** రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన ముత్యాల శివ దశదిన కర్మకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు

**- కుల కోటేశ్వర్ ప్రధాన అర్చకులు చందేపల్లి**





**తొలి అక్షరం/రామన్నపేట ఆగస్టు 17:** శ్రావణమాసం ప్రారంభం మొదటి సోమవారం రోజున సిద్దేశ్వర స్వామి పంచామృతములతో అభిషేక కార్యక్రమం జరిగినది తదుపరి నాగుల పంచమి నాగదేవతకు పంచామృతములతో అభిషేకం మహిళలు అధిక సంఖ్యలో చేసినారు తదుపరి పుట్టలో పాలు పోయడం జరిగింది ఉసిరి చెట్టు కింద పశుబొట్టు తీసుకున్నారు స్వామివారి హారతి తీర్థప్రసాదాలు తీసుకోవడం జరిగినది గ్రామ పెద్దలు గ్రామ మహిళలు పాల్గొనడం జరిగినది